సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
గురువారం । 27 । మార్చి । 2025



శుభాల రేయి కోసం ఎదురుచూపు

రంజాన్ మాసం చివరి పది రోజుల్లో ఐదు బేసి రాత్రులను తాఖ్ రాత్‌లుగా భావిస్తారు. నాల్గవ తాఖ్ రాత్ గురువారం రానుంది. దీనినే'లైలతుల్ ఖద్ర్'గా పిలుస్తారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు॥ (సా॥)	సహార్ శుక్ర॥ (ఉ॥)
కడప	6.31	4.58
పులివెందుల	6.33	5.06
ప్రొద్దుటూరు	6.32	5.02

గరిష్టం/కనిష్టం
39.6/23.4

వాతావరణం

జిల్లాలో బుధవారం 23.4 – 39.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ చైర్మన్ ఎన్నిక

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ నూతన చైర్మన్ ఎన్నిక గురువారం జరగనుందని జెడ్పీ సీఈఓ ఓబులమ్మ తెలిపారు. నూతన జెడ్పీ చైర్మన్ ఎన్నికకు ఎన్నికల కమిషన్ 18న నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున 48 మంది సభ్యులు, ఒక టీడీపీ సభ్యుడు ఉండగా, పులివెందుల జెడ్పీటీసీ సభ్యుడు మృతి చెందారన్నారు. ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ శ్రీధర్ అధ్యక్షతన జెడ్పీ చైర్మన్ ఎన్నిక కార్యక్రమం ఉంటుందని, ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని ఆమె వివరించారు.

మాతృ మరణాలకు అడ్డుకట్ట వేయాలి

కడప రూరల్: మాతృ మరణాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా కార్యాలయంలోని డీఎంహెచ్‌ఓ చాంబర్‌లో మాధవరం పీహెచ్‌సీ, కడప అగాడి స్ట్రీట్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో సంభవించిన మాతృ మరణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ప్రమాదకర గర్భిణులను గుర్తించి వారి ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. జనన ప్రణాళిక గురించి వివరించాలని పేర్కొన్నారు. ఈ సమీక్షలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ హిమదేవి, డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, డీపీఎంఓ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, లక్ష్మీసుశీల, వైద్యాధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీస్

బ్రహ్మంగారిమఠం: మండలంలోని సోమిరెడ్డిపల్లె-1 గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ గిద్దలూరు సుభాష్ చంద్రబోస్‌కు బుధవారం ఎంపీడీఓ కార్యాలయం నుంచి షోకాజ్ నోటీస్ అందింది. చంద్రబోష్ గ్రామ చివాలయం పరిధిలోని గ్రామాల ప్రజలు కుల ధ్రువీకరణ, ఇన్‌కమ్, క్యాస్టు సర్టిఫికెట్లు మంజూరు చేయాలంటే రూ.200నుంచి 300వరకు వసూల్‌చేస్తున్నట్లు మీడియా ద్వారా ఎంపీడీఓకు ఫిర్యాదులు అందడంతో నోటీస్ ఇచ్చారు. ఈసందర్భంగా ఎంపీడీఓ వెంగమునిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని ఏ గ్రామ సచివాలయంలో నైనా సిబ్బంది వసూళ్లకు ప్రయత్నిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. తప్పుచేసిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

28లోపు డీఎస్సీ కోచింగ్‌కు వెబ్ ఆప్షన్ చేసుకోవాలి

కడప రూరల్: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు సంబంధించి జ్ఞానభూమి పోర్టల్‌లో ఈనెల 28లోపు ఫేజ్-2 వెబ్ ఆప్షన్లు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. జ్ఞానభూమి పోర్టల్, ఎండీఎఫ్‌సీ.ఏపీసీ ఎఫ్‌ఎస్‌ఎస్.ఇన్ వెబ్ పోర్టల్‌లో వెబ్ ఆప్షన్ సర్వీసు ప్రారంభించామని పేర్కొన్నారు. ఈనెల 28లోపు ఫేజ్-2 వెబ్ ఎంపికలను చేసుకోవాలన్నారు. ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం షార్ట్ లిస్టు చేయబడిన ఎస్సీ ఎస్టీ అభ్యర్థుల జాబితాను వెబ్‌పోర్టల్‌లో ప్రదర్శిస్తామని తెలిపారు. షార్ట్ లిస్టు చేయబడిన అభ్యర్థులు అన్ని కోచింగ్ సంస్థలకు వారి ప్రాధాన్యతలను ఇవ్వాలన్నారు. కాగా ఫేజ్-1 వెబ్ ఎంపికకు ఎడిట్ ఆప్షన్ లేదని తెలిపారు.

జెడ్పీ చైర్మన్ ఎన్నికకు సర్వం సిద్ధం



నేడే ఎన్నిక

- ఎన్నికలను నిలిపేయాలంటూ స్టేటస్‌కో కోసం టీడీపీ యత్నం
- చైర్మన్ ఎన్నికలు నిర్వహించుకోవాలని ఆదేశించిన హైకోర్టు
- పోటీలో లేమంటూనే అడ్డగించే ప్రక్రియకు 'పచ్చ' పన్నాగం
- 47మంది జెడ్పీటీసీలు వైఎస్సార్‌సీపీ ప్రతినిధులే...విప్ జారీ



జిల్లా పరిషత్ సమావేశ భవనం

సాక్షి ప్రతినిధి, కడప: జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికకు సర్వం సిద్ధమైంది. గురువారం కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ నేతృత్వంలో ఎన్నిక ప్రక్రియ కొనసాగనుంది. ఉదయం 10గంటలకు నామినేషన్ స్వీకరణ, 12గంటలకు నామినేషన్లు పరిశీలన పూర్తి, అనంతరం తుది జాబితా విడుదల చేయనున్నారు. 1గంటలకు నామినేషన్ ఉపసంహరణ చేపట్టనున్నారు. ఆపై పోటీలో ఉన్న అభ్యర్థుల మధ్య చైర్మన్ ఎన్నిక ప్రక్రియ కొనసాగించనున్నారు. జిల్లాలో 50 మంది జెడ్పీటీసీ సభ్యులుండగా వారిలో పులివెందుల జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి ఓ ప్రమాదంలో చనిపోయారు. ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి జెడ్పీ చైర్మన్‌గా కొనసాగుతూ రాజంపేట ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జెడ్పీకి రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది. ప్రస్తుతం జిల్లా పరిషత్‌లో 48 మంది జెడ్పీటీసీ సభ్యులున్నారు. వారిలో గోపవరం మండల జెడ్పీటీసీ జయరామిరెడ్డి మాత్రమే తెలుగుదేశం పార్టీ నుంచి ఎన్నికయ్యారు. మిగతా అందరూ వైఎస్సార్‌సీపీ నుంచి ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులే కావడం విశేషం.

వైఎస్సార్‌సీపీ సభ్యులకు విప్ జారీ...

జిల్లా పరిషత్‌లో 47మంది జెడ్పీటీసీలకు వైఎస్సార్‌సీపీ విప్ జారీ చేసింది. జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి సూచన మేరకు వేముల జెడ్పీటీసీ బయపురెడ్డి ద్వారా సభ్యులకు విప్ జారీ చేశారు. విప్ జారీ చేసిన రిసిప్ట్ కాపీలు ఎన్నికల అధికారికి అందజేయనున్నారు. విప్ అందుకున్న సభ్యులంతా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉంది. విప్ ధిక్కరిస్తే ఆయా సభ్యులు సభ్యత్వం కోల్పోవాల్సి వస్తుంది. ప్రస్తుతం సభ్యులంతా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నట్లు ముక్తకంఠంతో వెల్లడిస్తున్నారని సమాచారం. దాంతో వైఎస్సార్‌సీపీ ఆత్మవిశ్వాసంతో ఉంది. చైర్మన్‌గిరిని పార్టీ ఖాతాలో జమ చేసుకునేందుకు సన్నద్ధంగా ఉంది.

రామగోవిందురెడ్డిని వరించనున్న చైర్మన్ పీఠం



బ్రహ్మంగారిమఠం మండల జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల రామగోవిందు రెడ్డికి జెడ్పీ చైర్మన్ పీఠం దక్కనుంది. వైఎస్సార్‌సీపీ చైర్మన్ అభ్యర్థిగా ఆపార్టీ ప్రకటించింది. రెండు పర్యాయాలుగా బి.మఠం జెడ్పీటీసీగా ఆయన ప్రాతినిథ్యం వహిస్తున్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా నేతలతో ప్రత్యేకంగా సమావేశమై రామగోవిందురెడ్డి అభ్యర్థిత్వాన్ని ఎంపిక చేశారు. అధినేత సూచనలు మేరకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు పార్టీ ప్రతినిధులు చైర్మన్ ఎన్నిక కోసం కంకణబద్ధులై ఉన్నారు. కలిసికట్టుగా ఎన్నిక ప్రక్రియ వ్యవహారం నడిపించేందుకు సన్నాహాలు చేస్తుండడం విశేషం.

తెలుగుదేశం పార్టీ ద్వంద్వనీతి

జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికలో టీడీపీ ద్వంద్వనీతి ప్రదర్శించింది. సంఖ్యాబలం లేని కారణంగా ప్రజాతీర్పుకు గౌరవించి చైర్మన్ ఎన్నికలో పోటీలో లేమంటూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్ శ్రీనివాసులరెడ్డి ప్రకటించారు. వాస్తవాలు పరిశీలిస్తే అందుకు విరుద్ధమైన సంకేతాలు తెరపైకి వచ్చాయి. జిల్లా అధ్యక్షుడు పోటీలో లేమంటూనే మరోవైపు టీడీపీ జెడ్పీటీసీ జయరామిరెడ్డి ద్వారా ఎన్నికలను నిలుపుదల చేయాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. బరిలో నిలిచే శక్తి లేకపోవడంతో చైర్మన్ ఎన్నిక నిలుపుదల చేసేందుకు కుట్రలు పన్నారు. టీడీపీ జెడ్పీటీసీతోపాటు మరో 7మంది తెలుగుదేశం పార్టీ వర్గీయులు హైకోర్టును ఆశ్రయించారు. చైర్మన్ ఎన్నిక అడ్డుకునేందుకు శతవిధాలుగా ప్రయత్నించారు. స్టేటస్ కో తీసుకొచ్చేందుకు విశ్వప్రయత్నం చేశారు. చైర్మన్ ఎన్నిక నిలుపుదల చేసేందుకు, స్టేటస్‌కో ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించడం విశేషం. సమయం లభిస్తే జెడ్పీటీసీ సభ్యులను వశపర్చుకోవాలనే దుర్బుద్ధితోనే హైకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. కాగా చైర్మన్ ఎన్నికకు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించుకోవాలని హైకోర్టు ఆదేశిస్తూనే తుది ఫలితం హైకోర్టు ఉత్తర్వులకు లోబడి ఉండాలని ప్రకటించింది.



జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికకు సంబంధించి ఏర్పాటు చేసిన వేదిక

ఫౌంటైన్‌లా మారి.. వృథాగా పారి..



పైపులైను లీకేజీతో వృథాగా పోతున్న నీరు

నేలను చిమ్ముకుంటూ .. నింగి వైపు ఎగసిపడుతున్న ఈ నీటి జోరును చూసి ఫౌంటైన్ అనుకుంటే పొరపాటే. బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ నుంచి గోపవరం మండలం పి.పి.కుంట సమీపంలోని సెంచురీ పానెల్స్ పరిశ్రమ నీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన పైపులైను లీకైన దృశ్యమిది. నెల్లూరు రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఉన్న పైపులైను గేట్‌వాల్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నీరు దాదాపు 20 అడుగుల పైకి చిమ్ముతూ ఇదిగో ఇలా ఫౌంటైన్‌ను తలపించింది. సుమారు గంట పాటు నీరు వృథాగా పోయింది. విషయం తెలుసుకున్న సెంచురీ పానెల్స్ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది అప్రమత్తమై బ్రహ్మంసాగర్‌లో మోటారు నిలుపుదల చేయడంతో నీటి ఉధృతి తగ్గింది. అప్పటికే చుట్టుపక్కల ప్రాంతమంతా భారీగా నీరు నిలిచింది. కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.
-బద్వేలు అర్బన్

మున్సిపాలిటీల్లో 24 గంటల్లో ప్లాన్ అప్రూవల్



మాట్లాడుతున్న టౌన్‌ప్లానింగ్ ఆర్‌డీడీ విజయ్‌భాస్కర్

కడప కార్పొరేషన్: మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఇళ్ల నిర్మాణం చేసే వారికి 24 గంటల్లోపే ప్లాన్ అప్రూవల్స్ ఇస్తామని టౌన్‌ప్లానింగ్ ఆర్‌డీడీ టి.విజయ్ భాస్కర్ అన్నారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో పుర, నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే భవన నిర్మాణాలకు ప్రభుత్వం జారీ చేసిన నూతన ఉత్తర్వులపై వైఎస్సార్ కడప జిల్లా, అన్నమయ్య జిల్లా ఎల్‌టీపీ, ప్రణాళిక సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ రంగంలో నిబంధనలను సరళీకరిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ జీవో జారీ చేసిందని తెలిపారు. ఈ నిబంధనల ప్రకారం భవన నిర్మాణాలు చేపట్టేవారు స్వీయ ధ్రువీకరణతో ఎల్టీపీల ద్వారా 24 గంటల్లోపే ప్లాన్ అప్రూవల్ పొందవచ్చన్నారు. ప్రణాళికా సిబ్బంది భవన నిర్మాణ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారని చెప్పారు. 300 చదరపు మీటర్ల లోపు భవనాలకు యజమానులే ప్లాన్ ధ్రువీకరించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆర్కిటెక్చర్లు, ఇంజనీర్లు, టౌన్ ప్లానర్లు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. లేఅవుట్ కు తప్పకుండా అనుమతులు ఉండాలన్నారు. సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీం క్రింద భవన నిర్మాణ అనుమతులను అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ జారీ చేస్తూ ఉండేదని, ఇకపై పట్టణ స్థానిక సంస్థలు జారీ చేస్తాయని తెలిపారు. 'కుడా'పీఓ శైలజ, అన్నమయ్య పీఓ సంధ్య, సీపీ రమణ, ఏసీపీలు మునిరత్నం, మునిలక్ష్మి, టీపీఓ రత్నరాజు, టౌన్ ప్లానింగ్, వార్డ్ ప్లానింగ్ సెక్రటరీలు, ఎల్‌టీపీలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా రఘురామిరెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిని పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. శెట్టిపల్లె రఘురామిరెడ్డి మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆయనను క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా నియమించారు.

3న వైవీయూలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏప్రిల్ 3వ తేదీన క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ కళాశాల ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ ఎస్ రఘునాథరెడ్డి తెలిపారు. విశ్వవిద్యాలయ కులసచివులు ఆచార్య పద్మ, ప్లేస్‌మెంట్ సెల్ ప్రతినిధులతో కలిసి ఉద్యోగ డ్రైవ్ కి సంబంధించిన పోస్టర్‌ను విశ్వవిద్యాలయంలోని వీసీ చాంబర్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగాల ఎంపికలకు ప్రముఖ మల్టీ నేషనల్ బయోఫార్మాసూటికల్ కంపెనీ బయోకాన్ విద్యాలయానికి రానుందని తెలిపారు. బయోకాన్ కంపెనీలోని ప్రొడక్షన్ విభాగంలో చేరేందుకు బీఎస్సీ కెమిస్ట్రీ,ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, డిప్లొమా - కెమికల్, బీటెక్ - కెమికల్ అర్హతలు కలిగి ఉండాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ విభాగంలో ఉద్యోగాల కోసం ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ అర్హతలు ఉండాలన్నారు. విద్యార్థులు వారి బయోడేటాతో విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయ ప్రాంగణంలో జరిగే ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలన్నారు.

కూలీల పొట్ట కొడుతున్నారు



బస్తాలను అన్‌లోడ్ చేస్తున్న కూలీలు

రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి ఆ కార్మికులది. రోజూ ఒళ్లొంచి శ్రమటోడ్చి పనిచేస్తే కానీ వీరికి కూలి రాదు... ఆ డబ్బులొస్తేగానీ పూట గడవదు. వారి శ్రమను కళ్లార చూసిన వారెవరైనా అయ్యో పాపం అనాల్సిందే. రోజూ పల్లెల నుంచి అన్నం తెచ్చుకుని కండలు కరిగించి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కూలీలకు సాయం చేయాల్సిన కాంట్రాక్టర్లు వారి శ్రమను దోపిడీ చేస్తున్నారు. అండగా నిలబడాల్సిన అధికారులే వారి పొట్ట కొడుతున్నారు.

- కూలి చెల్లింపులో చేతి వాటం
- రోజు రూ.20వేల వరకు అధికారులు, కాంట్రాక్టర్లకు ఆదాయం
- వేర్ హౌసింగ్ గోడౌన్లలో ఇదీ.. పరిస్థితి

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు పరిధిలో ఏపీ స్టేట్ వేర్ హౌస్‌కు సంబంధించి రామేశ్వరం, వైఎంఆర్ కాలనీ, కానపల్లె గ్రామం వద్ద మూడు గోడౌన్లను నిర్మించారు. ప్రస్తుతం సత్యసాయి, అనంతపురం జిల్లాల పరిధిలో నాఫెడ్ ద్వారా ప్రభుత్వం కందులు కొనుగోలు చేసి ప్రొద్దుటూరుకు పంపిస్తున్నారు. స్థానిక గోడౌన్లలో వీటిని భద్రపరుస్తున్నారు. ప్రస్తుతం వైఎంఆర్ కాలనీలోని గోడౌన్ నిండటంతో కానపల్లె గ్రామం వద్ద ఉన్న గోడౌన్‌లో కందుల బస్తాలను నింపుతున్నారు. కాగా కందుల బస్తాల అన్‌లోడింగ్‌కు సంబంధించి ప్రభుత్వం చెల్లించే హమాలి చార్జెస్‌లో అధికారులు చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. బస్తాకు ఎంత కూలి ఇస్తారన్న విషయం రహస్యంగా ఉంచారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం 50 కిలోల బస్తాకు రూ.8 చొప్పున కూలి చెల్లిస్తోంది. ఈ ప్రకారం రోజు సుమారు వంద మంది కూలీలు వేల బస్తాలను వచ్చిన లారీల నుంచి దించి గోడౌన్‌లో నింపుతున్నారు. రోజు 5 నుంచి 10వేల బస్తాల వరకు సరుకును దింపుతున్నారు. కూలీలకిచ్చే దాంట్లోనే కాకుండా.. ప్రతి లారీ యజమాని నుంచి అదనంగా మామూళ్లు కూడా అందుకుంటున్నారని తెలుస్తోంది. పేదల ఆకలిని ఆసరాగా తీసుకున్న అధికారులు, కాంట్రాక్టర్లు వీరి కూలి చెల్లింపులో మోసం చేస్తున్నారు. తద్వారా రోజుకు అటు కాంట్రాక్టర్, ఇటు అధికారులు కలిపి సుమారు రూ.20వేలు లబ్ధి పొందుతున్నట్లు సమాచారం. సుమారు నెల రోజులుగా ప్రొద్దుటూరులో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. కూలి చెల్లింపు విషయమై అనేక మంది హమాలీలను 'సాక్షి' వివరణ కోరగా తాము చుట్టుపక్కల గ్రామాల నుంచి పొట్ట కూటి కోసం ఇక్కడికి వస్తున్నామన్నారు. బస్తాకు కూలి ఎంత వేస్తారనే విషయం తమకు తెలియదని, అడిగితే మరుసటి రోజు ఈ పని కూడా ఉండదన్నారు. పేదలమైన తమకు తప్పనిసరిగా పని ఉంటే తప్ప పొట్ట పోసుకోలేమన్నారు. ప్రతి రోజు సాయంత్రం అవుతూనే ఆ రోజుకు సంబంధించి కూలి ఎంత అనేది లెక్క వేసి చెల్లిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ శనివారం రూ.1200, ఆదివారం రూ.1340, సోమవారం రూ.700 కూలి చెల్లించాలని తెలిపారు. కూలీలకు సంబంధించి మేస్త్రి వెంకటయ్యను ప్రశ్నించగా.. బస్తాకు ఎంత కూలి అన్న విషయం తనకు కూడా తెలియదని తప్పించుకున్నారు. ఇంత వరకు ప్రభుత్వం నుంచి బిల్లు రాలేదని, బిల్లు వస్తేనే ఎంత కూలి అనేది తేలుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఏ మేరకు చెల్లించాల్సి ఉందనేది కూడా ఆయన చెప్పలేదు. ఇదే విషయమై గోడౌన్‌కు సంబంధించిన టెక్నికల్ అసిస్టెంట్ కోటేశ్వరరావును వివరణ కోరగా హమాలీల కూలి చెల్లింపు తమకు సంబంధం లేదన్నారు. కందులు నాణ్యతగా ఉన్నాయా లేదా అనేది మాత్రమే తాను పరిశీలిస్తానన్నారు. అనంతపురం జిల్లాకు చెందిన కాంట్రాక్టర్ రామకృష్ణ కూలీల కాంట్రాక్టును తాత్కాలికంగా దక్కించుకున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు విచారణ చేసి కూలీలకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




ఒకేచోట కలిసి భోంచేస్తున్న హమాలీలు

అన్నమయ్యపై టీటీడీ చిన్నచూపు!

- పేరుకే రాజంపేట నియోజకవర్గం
- రామయ్య బ్రహ్మోత్సవాల్లో వైఎస్సార్ జిల్లా యంత్రాగానికి పెద్దపీట
- ఈసారైనా టీటీడీ తన వైఖరి మార్చుకోవాలంటున్న రాజంపేట వాసులు





రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామాలయం

రాజంపేట: ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు జిల్లా విభజనసెగ వెంటాడుతోంది.అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్టలోని కోదండరామాలయం వైఎస్సార్‌జిల్లాలో ఉన్న తరుణంలో అన్నమయ్య జిల్లా పరంగా తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) చిన్నచూపు చూస్తోందన్న విమర్శలు ఉన్నాయి.పేరుకే రాజంపేట నియోజకవర్గం అని, బ్రహ్మోత్సవాల్లో వైఎస్సార్ జిల్లా యంత్రాంగానికి టీటీడీ పెద్దపీట వేస్తోందని ఇక్కడి వారి భావన. వైఎస్సార్ జిల్లా కలెక్టర్, ఎస్పీతోపాటు అన్నమయ్య జిల్లా కలెక్టర్, ఎస్పీని భాగస్వాములను చేయకుండా టీటీడీ వ్యవహరిస్తున్న తీరుపై జిల్లా వాసులు పెదవి విరుస్తున్నారు.

టీటీడీలో విలీనం కాకముందునుంచి..


ఒంటిమిట్ట కోదండరామాలయం టీటీడీలో విలీనం కాకముందు నుంచి బ్రహ్మోత్సవాలను రాజంపేట నియోజకవర్గ యంత్రాంగమే విజయవంతంగా నిర్వహిస్తోంది. కొత్త జిల్లా ఏర్పాటు క్రమంలో నందలూరు ఒంటిమిట్ట మండలాలు వైఎస్సార్ జిల్లాలో విలీనమయ్యాయి. దీంతో టీటీడీ కూడా తన దిశను మార్చుకుందన్న అపవాదును మూటకట్టుకుంది. స్థానికులతో పాటు రాజంపేట నియోజకవర్గంలోని ఆరుమండలాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు బ్రహ్మోత్సవాల్లో చోటు లేకుండా చేశారు. ఉభయ వైఎస్సార్ జిల్లాకు చెందిన వారి భాగస్వామ్యంతో చేస్తే ఎలాంటి బేధాభిప్రాయాలు రావన్న వాదన బలంగా వినిపిస్తోంది. రాములోరి కల్యాణోత్సవం సమయంలో పాసులు, ఇతర అనుమతులు విషయంలో అన్నమయ్య జిల్లాకు టీటీడీ మొండిచెయ్యి చూపిస్తోంది. ఇది సరైన విధానం కాదని, రామాలయం మాది.. పెత్తనం వారిదా అన్న అభిప్రాయం అధికారులు, భక్తులలో కూడా వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా టీటీడీ ఒంటిమిట్ట రామాలయం ఉత్సవాల నిర్వహణ విషయంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు. ఏప్రిల్ 6 నుంచి 14 వరకు జరిగే శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణలో లా అండ్ ఆర్డర్ పగ్గాలు కడప పోలీసులకే టీటీడీ , ప్రభుత్వం అప్పగిస్తోంది. ఉభయ వైఎస్సార్ జిల్లాలకు ఒంటిమిట్ట రామాలయం ప్రధానమైనప్పటికీ లా అండ్ ఆర్డర్ విషయంలో అన్నమయ్య జిల్లా ఖాకీ పెద్దల భాగస్వామ్యం ఉండకపోవడం గమనార్హం. టీటీడీ కడప పోలీసువ్యవస్థకే ప్రాధాన్యత ఇవ్వడంపై జిల్లా పోలీసువర్గాలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నాయి.

జిల్లా యంత్రాంగానికి భాగస్వామ్యం కల్పించాలి



ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో టీటీడీ అన్నమయ్య జిల్లాపై చిన్న చూపు చూపుతోంది. రాములోరి కల్యాణోత్సవంలో అన్నమయ్య జిల్లా యంత్రాంగానికి భాగస్వామ్యం కల్పించాలి. ఆలయం రాజంపేట నియోజకవర్గంలో ఉంటే, ఉత్సవాల నిర్వహణ విషయంలో జిల్లాకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం సరికాదు.
– కెఎంఎల్ నరసింహా, కన్వీనర్, ఆల్ ఇండియానేషనల్ బీసీ ఫ్రంట్

పూర్వ సంప్రదాయాన్ని కొనసాగించాలి



పూర్వం నుంచి ఒంటిమిట్ట కోదండ రాముని బ్రహ్మోత్సవాల్లో రాజంపేటకు చోటు కల్పించేవారు. ప్రస్తుతం వైఎస్సార్ జిల్లా యంత్రాంగానికి కల్యాణోత్సవం నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. స్థానికులనే పదం లేకుండా చేయడం సరికాదు. ఈ సారి జరిగే కల్యాణోత్సవంలో పూర్వ సంప్రదాయాన్ని టీటీడీ కొనసాగించాలి.
– మర్రి కళ్యాణ్, ఎస్ఆర్ఐ, రాజంపేట

క్లుప్తంగా

గొర్రెల యజమాని ఆత్మహత్య


మృతి చెందిన జోసెఫ్

కలసపాడు : మండలంలోని కొండపేటకు చెందిన జోసెఫ్ (42) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు జోసెఫ్ గొర్రెలను మేపుకుంటుండేవాడు. కొంత మంది వద్ద అప్పు చేసి గొర్రెలను కొనుగోలు చేసేవాడు. నెలకు, రెండు నెలలకు గొర్రెలు చనిపోవడంతో అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. దీంతో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య సునీత, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన రాజారెడ్డి

కలసపాడు : మండలంలోని లింగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొత్తపల్లె రాజారెడ్డి (45) మంగళవారం రాత్రి శంఖవరం, లింగారెడ్డిపల్లె గ్రామాల మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు రాజారెడ్డి తన సొంత పని నిమిత్తం పోరుమామిళ్లకు తన ద్విచక్ర వాహనంలో వెళుతుండగా టేకూరుపేటకు చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై లింగారెడ్డిపల్లెకు వెళుతూ శంఖవరం, లింగారెడ్డిపల్లె గ్రామాల మధ్యలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాజారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతునికి భార్య సుధాదేవి, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మరోసారి కూలిన చౌదరివారిపల్లె వంతెన


చౌదరివారిపల్లె దగ్గర కూలిన వంతెన

బ్రహ్మంగారిమఠం : మండలంలో చౌదరివారిపల్లె నుంచి పలుగురాళ్లపల్లె మీదుగా సిద్దయ్యమఠం– పోరుమామిళ్లకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి చౌదరివారిపల్లె దగ్గర ఉన్న వంతెన మళ్లీ కూలింది. మూడు నెలల క్రితం వంతెన కూలడంతో అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. వాహనాల రాకపోకలు అధికం కావడంతో బుధవారం మళ్లీ వంతెన కూలింది. దీంతో ఎర్రంపల్లె, బొగ్గులవారిపల్లె, బాకరాపేట, పలుగురాళ్లపల్లె, కొత్తపల్లె, జౌకుపల్లె, ముడుమాల, సిద్దయ్యమఠం తదితర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

వంతెన నిర్మాణం కోసం రూ.4.50 లక్షలు మంజూరు

వంతెన నిర్మాణం కోసం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆర్‌అండ్‌బీ అధికారుల ద్వారా రూ.4.50 లక్షల నిధులు మంజూరు చేయించారని టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి తెలిపారు. త్వరలోనే వంతెన నిర్మాణ పనులు చేపడతారన్నారు.

నా మాటే శాసనం.!

- వేములలో పోలీసులకు సవాల్‌గా మారిన పార్థసారధిరెడ్డి
- గొందిపల్లెలో టీడీపీ కార్యదర్శి రోడ్డు పనులు నిలిపివేత
- పోలీసుల ఆదేశాలు సైతం ధిక్కరించిన వైనం


గొందిపల్లె గ్రామం వద్ద మోహరించిన పార్థసారధిరెడ్డి వర్గీయులు


పార్థ వర్గీయులను బతిమాలుతున్న పోలీసు అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : వ్యవస్థలు నిర్వీర్యమైతే సమాజానికి పెనుముప్పు దాపురించినట్లే. ప్రస్తుతం అదే వేముల కేంద్రంగా జరుగుతోంది. అధికార పార్టీకి పోలీసు యంత్రాంగం తొత్తులుగా వ్యవహరించడంతో తాజాగా బుధవారం పోలీసు అధికారులకు సైతం ధిక్కార స్వరం వినిపించింది. వెరసి పోలీసులు బతిమలాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా.. జెడ్పీ గ్రాంటు నుంచి ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి రూ.5లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులను వేముల మండలం గొందిపల్లె గ్రామంలో రైతులు పొలాలకు వెళ్లే రహదారి కోసం కేటాయించారు. రోడ్డు పనులను అదే గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా కార్యదర్శి మైసూరారెడ్డికి ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అప్పగించారు. ఆమేరకు బుధవారం రోడ్డు పనులు చేసేందుకు మైసూరారెడ్డి యత్నించారు. అంతలోనే స్థానిక పోలీసు అధికారులు మైసూరారెడ్డికి ఫోన్ చేసి రోడ్డు పనులు నిలిపేయాల్సిందిగా ఆదేశించారు. అదేమని ప్రశ్నిస్తే వెళ్లి పార్థసారధిరెడ్డి అనుమతి తీసుకోవాలని వెల్లడించారు. నేనెందుకు పార్థసారధిరెడ్డి అనుమతి తీసుకోవాలి, ఆయనేమైనా నిధులిచ్చారా.. లేక నాకేమన్నా పార్థ బాసా.. అంటూ మైసూరారెడ్డి ప్రశ్నించినట్లు సమాచారం. అలా అయితే రోడ్డు పనులు చేసేందుకు కుదరదంటూ సదరు పోలీసు అధికారులు హుకుం జారీ చేశారు. అదే విషయాన్ని మైసూరారెడ్డి జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. నేను తెలుగుదేశం పార్టీ వ్యక్తినే, పార్థసారధిరెడ్డి తెలుగుదేశం పార్టీకి చెందిన వారే. నాకు కేటాయించిన గ్రాంటు ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను మా స్వగ్రామంలో చేయవద్దని పోలీసు అధికారులు ఎలా నిర్దేశిస్తారంటూ ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

ఎస్పీ తలంటుతో...

రోడ్డు పనులకు చెందిన విషయాన్ని కూలంకషంగా తెలుసుకున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పులివెందుల డీఎస్పీకి ఫోన్ చేసి తలంటినట్లు సమాచారం. వెంటనే డీఎస్పీ రంగప్రవేశం చేసి ఎస్‌ఐ, సీఐలపై చిర్రుబుర్రులాడినట్లు తెలుస్తోంది. రోడ్డు పనులు చేసుకోవాలంటూ టీడీపీ జిల్లా కార్యదర్శి మైసూరారెడ్డికి తెలియజేశారు. బలప్రదర్శన కాకుండా మామూలుగా రోడ్డు పనులు ప్రారంభించాలని సూచించారు. పార్థసారధిరెడ్డికి కూడా చెప్పాం, వారు అటువైపు రారు, మీ పనులు మీరు చేసుకోండంటూ సెలవిచ్చారు. ఆమేరకు మైసూరారెడ్డి మరో ఇద్దరు వెళ్లి పనులు మొదలు పెట్టగా అంతలోనే అక్కడికి దాదాపు 50మంది వరకూ పార్థసారధిరెడ్డి అనుచరులు చేరుకొని హంగామా సృష్టించారు. పోలీసు అధికారుల సూచనలు సైతం ధిక్కరించి మరీ సవాల్ విసిరారు. మళ్లీ మైసూరారెడ్డి ఎస్పీకి ఫోన్ చేసి అదే విషయాన్ని తెలియజేశారు. పోలీసులు తనను ఎలాంటి బలప్రదర్శన వద్దని చెప్పి పార్థసారధిరెడ్డికి సహకరిస్తున్న వైనాన్ని వివరించారు. వెంటనే ఎస్పీ జోక్యం చేసుకోవడంతో ఘటనా స్థలికి పోలీసులు చేరుకొని పార్థసారధిరెడ్డి వర్గీయులను బతిమాలి అక్కడి నుంచి పంపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆపై పోలీసులే దగ్గరుండీ సాయంత్రం 4గంటలకు రోడ్డు పనులు చేయించడం విశేషం.

నాడు కక్కుర్తి పడడంతోనే...

వేముల కేంద్రంగా టిఫెన్ బెరైటీస్ కంపెనీకి చెందిన బెరైటీస్ ఖనిజం రాత్రికి రాత్రే కనుమరుగైంది. దాదాపు 18 భారీ టిప్పర్లతో రెండు మిషన్లు పెట్టి తరలించారు. వేలాది టన్నుల ఖనిజం రాత్రికి రాత్రి తస్కరించేందుకు సహకరించిన పోలీసు యంత్రాంగానికి భారీ ఎత్తున నజరానా ముట్టినట్లు ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితుల్లో తిన్న విశ్వాసం మేరకు పోలీసు అధికారులు స్వయంగా రోడ్డు పనులు నిలిపేయాలంటూ టీడీపీ జిల్లా కార్యదర్శి మైసూరారెడ్డికి హుకుం జారీ చేశారని పలువురు వెల్లడిస్తున్నారు. ఆ ప్రాంతానికి వెళ్లవద్దంటూ ఎస్పీ చెప్పినా పార్థసారధిరెడ్డి వర్గీయులు 50 మంది అక్కడికి చేరుకొని హంగామా సృష్టించడానికి కారణం అక్కడి అధికారులంటే లెక్కలేని తనమేనని పలువురు వివరిస్తున్నారు. ఇప్పటికైనా వ్యవస్థలు నిర్వీర్యం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఆయా ఉన్నతాధికారులపై ఉందని ప్రజాస్వామ్యవాదులు పేర్కొంటున్నారు.


జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి జ్యోతి క్షేత్రం సమస్య


జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన ఎమ్మెల్సీ బృందం

పోరుమామిళ్ల : ఇటీవల అత్యంత చర్చనీయాంశంగా మారిన కాశినాయన జ్యోతి క్షేత్రంలో నిర్మాణాల కూల్చివేత గురించి బుధవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తీసుకెళ్లి వివరించారు. ఆయన వెంట నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, బి.కోడూరు మాజీ జెడ్పీటీసీ, మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాళ్లపల్లె నరసింహులు, కాశినాయన మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, గంటా రమణారెడ్డి, మేరెడ్డి రమణారెడ్డి తదితరులున్నారు. మూడు దశాబ్దాలకు పైగా కాశినాయన క్షేత్రంలో జరిగిన అభివృద్ధి, ఆగిపోయిన ఆలయ పనులు వివరిస్తూ.. హఠాత్తుగా ఫారెస్టు అధికారులు, పోలీసులు అక్కడ నిర్మాణాలు అడ్డంగా కూలగొట్టడం, భక్తుల మనోభావాలు దెబ్బతినడం తదితర అంశాలు ఎమ్మెల్సీ గోవిందరెడ్డి మాజీ సీఎంకు వివరించారు. వైయస్ జగన్ సానుకూలంగా స్పందించి త్వరలో ప్రధానమంత్రిని, కేంద్ర మంత్రులను కలసి మాట్లాడతానని చెప్పినట్లు డీసీ గోవిందరెడ్డి తెలిపారు. వైఎస్ జగన్ కూడా కాశినాయన క్షేత్రాన్ని సందర్శిస్తానని చెప్పారన్నారు.

శుభాల రేయి కోసం ఎదురుచూపు

- నేడు లైలతుల్ ఖద్ర్
- ఏర్పాట్లలో మసీదు కమిటీలు



కడప కల్చరల్ : పవిత్ర రంజాన్ మాసం చివరి పది రోజుల్లో ఐదు బేసి రాత్రులను తాఖ్ రాత్‌లు (పవిత్రమైన రాత్రులు)గా భావిస్తారు. ఇందులో భాగంగా ఇప్పటికే మూడు తాఖ్ రాత్‌లు గడిచిపోయాయి. ఇక రంజాన్ పర్వదినానికి మూడు రోజులే గడువు ఉంది. నాల్గవ తాఖ్ రాత్ గురువారం రానుంది. దీనిని ముస్లింలు 'లైలతుల్ ఖద్ర్' (పెద్దరాత్రి)గా వ్యవహరిస్తారు. ఈ రోజునే ముస్లిం ప్రపంచానికి ఆరాధ్యమైన, అత్యంత పవిత్రమైన దివ్య గ్రంథం ఖురాన్ అల్లాహ్ కృప మేరకు భూమిపై అవతరించిందని పవిత్ర గ్రంథాల ద్వారా తెలియవస్తోంది. అందుకే బడీరాత్‌ను అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ఈ సందర్భంగా రాత్రంతా పశ్చాత్తాప భావనతో దైవ సన్నిధిలో గడిపి ధన్యత పొందేందుకు ప్రయత్నిస్తారు. దైవం పాపలన్నింటినీ క్షమిస్తాడని పెద్దలు పేర్కొంటారు. బడీరాత్ రోజున నిండైన ప్రార్థనలు నిర్వహిస్తే 70 రాత్రుల్లో చేసే పుణ్యఫలాలు లభిస్తాయని విశ్వాసం ఉంది. అందుకే ఆ పవిత్రమైన రోజు కోసం పది రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహిస్తారు. ముఖ్యంగా ఈ పది రోజుల్లోని బేసి రాత్రులలో జాగరణ చేస్తూ ప్రార్థనలు చేస్తే అధిక పుణ్యం లభిస్తుందని ఆశిస్తారు. ఈ రోజుల్లో మసీదులు, ఇళ్లలో కూడా రాత్రంతా నవాజ్ చదవడం, పవిత్ర ఖురాన్ పఠించడం, జికర్ చేయడం, ఇతర ఆధ్యాత్మిక ప్రసంగాలతో తెల్లవారుజామున సెహరి సమయం వరకు గడుపుతారు. ఈ ప్రత్యేకమైన ప్రార్థనల సందర్భంగా మసీదు కమిటీలు విశేష ఏర్పాట్లు చేశాయి.

సమస్యలు అలా.. విస్తరణ ఎలా!

- నేడు దాల్మియా పరిశ్రమ విస్తరణ కోసం ప్రజాభిప్రాయ సేకరణ
- మెజార్టీ ప్రజల్లో వ్యతిరేకత


ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధం చేసిన ప్రాంగణం

మైలవరం : మైలవరం మండలం నవాబు పేట గ్రామం వద్ద నిర్మించిన దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీ విస్తరణ కోసం గురువారం మూడు గ్రామాల ప్రజలతో ప్రజాభిప్రాయసేకరణకు అధికారుల సిద్ధం చేశారు. ప్రస్తుతం దాల్మియా పరిశ్రమ 4.6 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో సిమెంట్‌ను ఉత్పత్తి చేస్తోంది. ప్రస్తుతం దాని పరిధిని 12.6 మెట్రిక్ టన్నులకు విస్తరణ చేయాలని దాల్మియా యాజమాన్యం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జిల్లా కలెక్టర్ , పర్యావరణశాఖ నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. అయితే దాల్మియా బాధిత గ్రామాలైన నవాబుపేట, దుగ్గనపల్లి ,చిన్న కొమెర్ల గ్రామస్తులు తమ సమస్యలను పరిష్కరించకుండానే ప్రజాభిప్రాయ సేకరణ చేయడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. అలాగే సిమెంటు రాయి కోసం బ్లాస్టింగ్ చేస్తున్న దాల్మియా యాజమాన్యం నిబంధనలు పాటించకుండా భారీగా పేలుడుతో రాయిని వెలికి తీస్తున్నారు. దీంతో ఆ పేలుడు ధాటికి తమ ఇళ్లు దెబ్బతింటున్నాయని నవాబుపేట గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే ఫ్యాక్టరీ నుంచి వస్తున్న బూడిద కారణంగా పరిసర పంట పొలాలు దెబ్బతినడంతోపాటు దిగుబడి కూడా రావడంలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. చిన్న కొమెర్లనుంచి నవాబుపేట వరకు రైల్వే ట్రాక్‌వద్ద నుంచి భారీగా మట్టి కట్ట వేశారు. గతంలో వర్షాలు వచ్చినప్పుడు కిలోమీటరు వెడల్పుతో రెండు మూడు వంకల ద్వారా నీరు ప్రవహించేది. అయితే ఈ మట్టి కట్ట వేయడం వల్ల ఒక వంక నుంచే నీరు ప్రవహించి నీరు రోజుల తరబడి పొలాల్లో నిలిచిపోతోంది. గతంలో 33 వేల క్యూసెక్కుల వర్షపు నీరు వంక ద్వారా ప్రవహించేది. ప్రస్తుతం ఉన్న 8వేల క్యూసెక్కులకు మించి ప్రవాహానికి అనువుగా లేనందున దుగ్గనపల్లి, నవాబుపేట గ్రామాలకు చెందిన పొలాల్లో రోజుల తరబడి నాలుగు నుంచి ఆరు అడుగుల వరకు నీరు ఉండటంతో పొలాలు సాగుకు అనుకూలంగా లేకుండాపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమ ఇంకా విస్తరిస్తే తమ గ్రామాలకు నష్టాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని బాధిత గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. 20 రోజుల క్రితం దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే బుడిద వల్ల దిగుబడి తగ్గి, నాణ్యత లేక, పంట అమ్ముకోలేక మోషే అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇలాంటి సమయంలో దాల్మియా యాజమాన్యం తమ సమస్యలు పరిష్కరించకుండా విస్తరణ పనులు చేపట్టడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మత సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను జరుపుకోవాలి

జిల్లా శాంతి కమిటీ సమావేశంలో జేసీ అదితి సింగ్


మాట్లాడుతున్న జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : మత సంప్రదాయాలను గౌరవిస్తూ శాంతియుత, ఆహ్లాదకర వాతావరణంలో భక్తి భావంతో రంజాన్, ఉగాది, శ్రీరామనవమి పండుగలను నిర్వహించుకునేలా జిల్లా శాంతి కమిటీ సభ్యులు సమన్వయ సహకారాలు అందించాలని జేసీ అదితిసింగ్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో రంజాన్, ఉగాది, శ్రీరామనవమి పండుగల నిర్వహణపై జేసీ అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో శాంతి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప, పులివెందుల ఆర్డీఓలు జాన్ ఇర్విన్, చిన్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ శాంతియుత ఆనంద వాతావరణంలో ఒకరి మతాచారాలను మరొకరు గౌరవించుకుంటూ భక్తి శ్రద్ధలతో రంజాన్, ఉగాది, శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించుకోవాలని శాంతి కమిటీ సంఘం సభ్యులను ఆదేశించారు. పండుగ వేడుకల సమయంలో ఆలయాలు, మజీద్‌ల వద్ద అన్ని రకాల భద్రతా ఏర్పాట్లను చేపట్టాలని సంబంధిత అధికారులను జేసీ ఆదేశించారు. ఎక్కడైనా ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే అధికారులకు, పోలీసు సిబ్బందికి సమాచారమివ్వాలన్నారు. అనవసరమైన విషయాలను అత్యుత్సాహంతో సోషల్ మీడియాలలో పోస్టు చేయడం వంటి చర్యలను అరికట్టేలా శాంతి కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో శాంతి కమిటీ సభ్యులు, పోలీసు శాఖ, వివిధ శాఖల అధికారులు, మైనారిటీ దేవదాయ శాఖ అధికారులు, పలువురు అలయ అర్చకులు, మౌజన్‌లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డిపై పోక్సో కేసు


ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పక్కన ఎడమవైపు మురళీధర్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు టీడీపీ కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డిపై రూరల్ పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఇదే కేసులో మరో ముగ్గురిపై కూడా పోక్సో కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆర్టీపీపీకి చెందిన మైనర్ బాలుడు ప్రొద్దుటూరులోని పూజా ఇంటర్నేషనల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. అతను ఐదుగురు అమ్మాయిల ఇన్‌స్టాగామ్ ఐడీలను హ్యాక్ చేసి 9, 10వ తరగతి అబ్బాయిలకు అమ్మాయిల వ్యక్తిగత మొబైల్ నంబర్లను పంపించేవాడు. ఆడ పిల్లల ఫొటోలతో కొన్ని కొత్త ఇన్‌స్టాగామ్ ఐడీలను తయారు చేసి అదే పాఠశాలలో చదువుతున్న అమ్మాయిలకు మెసేజ్‌లు చేస్తూ తనను ప్రేమించాలని, లేదంటే వారి మొబైల్ నంబర్లను మగపిల్లలకు ఇస్తానని బెదిరించేవాడు. ఇలా 32 ఫేక్ ఐడీలను క్రియేట్ చేసి ప్రేమించకుంటే వీడియోలు, ఫొటోలను అందరికీ పంపిస్తానని అమ్మాయిలను బ్లాక్‌మెయిల్ చేసేవాడు. ఇలా అతను అమ్మాయిలను ఇబ్బందులు పెడుతున్న విషయాన్ని బాలుడి తల్లిదండ్రులకు కొందరు తల్లిదండ్రులు తెలియచేశారు. అయితే బాలుడి తల్లిదండ్రులు అతన్ని దండించలేదు. బాలుడికి అడిగినంత డబ్బులిస్తూ అమ్మాయిలను బెదిరించమని ప్రోత్సహించేవారు.

తమ అబ్బాయి తప్పులు బయటపడతాయేమోనని.

తమ అబ్బాయి తప్పులు ఎక్కడ బయటపడతాయోననే భయంతో బాలుడి తల్లి ప్రొద్దుటూరుకు చెందిన టీడీపీ కౌన్సిలర్ మురళి, కొందరు రౌడీలను పాఠశాలకు తీసుకువచ్చింది. తమ కుమారుడి విషయాలు బయటపెడితే స్కూల్‌లో అనాథ పిల్లలను చంపేస్తానని భయపెట్టారు. మైనర్ బాలుడి ప్రవర్తన వల్ల 10వ తరగతి అమ్మాయిలు ఆత్మహత్య చేసుకునేందుకు కూడా సిద్ధపడ్డారు. దయచేసి ఆడపిల్లలను కాపాడాలని బాలికల తల్లులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందుకు ముఖ్య కారణమైన బాలుడి తల్లిదండ్రులు కొండమ్మ, మాధవరెడ్డిలతో పిల్లలకు ప్రాణహాని ఉందన్నారు. బాలికల తల్లుల ఫిర్యాదు మేరకు 78, 351 (2), రెడ్‌విత్ 3(5) బీఎన్‌ఎస్, సెక్షన్ 11 రెడ్‌విత్ 12 ఆఫ్ పోక్సో యాక్ట్ కింద మైనర్ బాలుడితో పాటు తల్లిదండ్రులు మూలయ్య కొండమ్మ, మూలయ్య మాధవరెడ్డి, మురళీపై బుధవారం కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

మైనార్టీలు ఉపాధి కల్పనకు దరఖాస్తు చేసుకోవాలి

కడప రూరల్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న మైనార్టీ వర్గానికి చెందిన వారు ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీస్ ఆర్థిక సంస్థ జిల్లా కార్యనిర్వాహక సంచాలకుడు డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య తెలిపారు. జిల్లాలోని ముస్లింలు, జైనులు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్శీలు ఈ రుణాలకు అర్హులని తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, జిల్లా ఖాదీ బోర్డు, ఖాదీ అండ్ గ్రామీణ పరిశ్రమల కమిషన్ ద్వారా సంబంధిత బ్యాంకుల వారితో సంప్రదించి స్కోరింగ్ విధానం ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 08562-241137, 98499 01140 నంబర్లలో సంప్రదించాలన్నారు.

చెడు వ్యసనాలకు బానిసై.. గొలుసు చోరీకి యత్నం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేష్‌బాబు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం ప్రకాశ్‌నగర్ కాలనీకి చెందిన సంగటి ప్రణయ్‌కుమార్ అనే యువకుడు చెడు వ్యసనాలకు బానిసై మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును దొంగిలించేందుకు ప్రయత్నించాడు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు. బుధవారం విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. ప్రణయ్‌కుమార్ అనే యువకుడు, చిలంకూరు గ్రామానికి చెందిన మరో మైనర్ బాలుడు చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. అవసరాలకు, ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో దొంగతనాలకు అలవాటుపడ్డారు. ఇళ్లల్లో ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని వారిని మాటల్లో పెట్టి వారిలో మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లి డబ్బులు సంపాదించాలనుకున్నారు. ఈ తరుణంలోనే ఈ నెల 24వ తేదీన కడప రోడ్డులోని మహేశ్వర్‌నగర్ కాలనీలో లక్ష్మీదేవి అనే మహిళ నిర్వహిస్తున్న చిల్లర అంగడి వద్దకు వెళ్లారు. వీరిద్దరూ సిగరెట్లు, నీళ్ల ప్యాకెట్లు కావాలని అడిగారు. ఆ వస్తువులను ఇచ్చేందుకు ఆమె వెనక్కు తిరగగానే ప్రణయ్‌కుమార్ లక్ష్మీదేవి మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కొని పారిపోయేందుకు ప్రయత్నించాడు. లక్ష్మీదేవి గట్టిగా కేకలు వేయడంతో ఇంటిలో ఉన్న ఆమె భర్త ఈశ్వర్‌రెడ్డి బయటకు వచ్చాడు. అలాగే అక్కడున్న మరికొంత మంది వ్యక్తులు రాగానే వారు ఇద్దరు పారిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ప్రధాన నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

రేపు మైదుకూరులో జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు మైదుకూరు పట్టణంలోని పోరుమామిళ్లరోడ్డులో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పేటీఎం సంస్థలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో డిప్యూటీ ఆఫీసర్, ఆఫీసర్, సీనియర్ ఆఫీసర్ ఉద్యోగాలకు, ఛానల్ ప్లే లిమిటెడ్ సంస్థలో అసెంబుల్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు టెన్త్, ఇంటర్మీడియేట్, డిప్లొమా, డిగ్రీ, పీజీ చేసి ఉండాలన్నారు. 18–35 మధ్య వయస్సుగల వారు అర్హులని, ఎంపికైన వారికి హోదాను బట్టి రూ.10–18 వేల వరకు వేతనం ఉటుందన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు విద్యార్హతల ధృవపత్రాలు, ఫోటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం కొత్తపల్లె గ్రామంలో భూ తగాదాల విషయమై జయరామిరెడ్డి, శివప్రసాద్‌రెడ్డిలు గొడవ పడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వీరిరువురికి గ్రామంలో భూ తగాదాల కారణంగా పాత కక్షలను మనస్సులో పెట్టుకుని బుధవారం మాట మాటా పెరిగి గొడవపడ్డారని పోలీసులు తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నారాయణ తెలిపారు.

వివాహిత అదృశ్యం

కొండాపురం : మండల పరిధిలోని చౌటిపల్లె గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి కనిపించడం లేదని కొండాపురం ఎస్‌ఐ విద్యాసాగర్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు వివాహిత మహిళ ఆదిలక్ష్మి ఈ నెల 23 వతేదీన ఇంటిలో తాడిపత్రికి వెళుతున్నా అని చెప్పి వెళ్లింది. ఇప్పటి వరకు కనిపించలేదని ఆమె మామ వి. ఓబులేసు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలోగా డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి



కడప ఎడ్యుకేషన్ : కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), భౌతిక శాస్త్ర విభాగంలోని మెటీరియల్ ఫిజిక్స్ ప్రొఫెసర్ బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలోగా ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ తెలిపారు. ఆయన పరిశోధనకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్‌ఐఆర్), రాష్ట్రీయ ఉత్చతార్ శిక్షా అభియాన్ (ఆర్‌యుఎస్‌ఏ) వంటి అత్యున్నత ప్రభుత్వ నిధుల సంస్థల నుంచి మద్దతు లభించిందన్నారు. ఈ సందర్భంగా, ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రమేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి. రామచంద్ర, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకట సుబ్బయ్య, బోధన, బోధనేతర సిబ్బంది డాక్టర్ బి. సుధాకర్ రెడ్డిని అభినందించారు.

పది భౌతికశాస్త్రం పరీక్షకు 27730 మంది హాజరు

కడప ఎడ్యుకేషన్ : పదవ తరగతి పరీక్షల్లో భాగంగా బుధవారం నిర్వహించిన భౌతికశాస్త్ర పరీక్షకు 27730 మంది హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 161 పరీక్షా కేంద్రాల్లో రెగ్యులర్‌లకు సంబంధించి 27877 మంది విద్యార్థులకుగాను 27730 మంది విద్యార్థులు హాజరుకాగా 147 మంది గైర్హాజరయ్యారు. అలాగే ప్రైవేటుకు సంబంధించి 191 మందికి 172 మంది హాజరుకాగా 19 మంది గైర్హాజరయ్యారు. 13 మంది ప్లైయింగ్ స్క్వాడ్ బృందాలు 70 పరీక్షా కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్ 88 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. అలాగే డీఈఓ షేక్ షంషుద్దీన్ నాలుగు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా, కడప జిల్లా అబ్జర్వర్ మధుసూదన్‌రావు 5 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పాఠశాల విద్య ఆర్‌జేడీ కాగిత శ్యాముల్ కడప నగరంలో రెండు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

లక్ష గృహాలకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటే లక్ష్యం

– జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎస్.రమణ


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ

కడప కార్పొరేషన్ : ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా వైఎస్సార్ కడప జిల్లాలో లక్షమంది వినియోగదారులకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎస్. రమణ అన్నారు. బుధవారం కడప విద్యుత్ భవన్‌లోని తన ఛాంబర్‌లో సంస్థాపన వెండర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక కిలోవాట్ సామర్థ్యానికి రూ. 30 వేలు, రెండు కిలోవాట్స్ సామర్థ్యానికి రూ. 60 వేలు, 3 కిలోవాట్ సామర్థ్యానికి రూ.78వేలు చొప్పున ప్రభుత్వం రాయితీ అందిస్తుందన్నారు. రాయితీ పోను మిగిలిన మొత్తానికి బ్యాంకులు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తాయన్నారు. బీ, సీ కేటగిరీ వారికి సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు అదనంగా మరో రూ.20వేలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ గృహాలపై సోలార్ రూఫ్ టాప్ అమర్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ యల్లారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోహన్, జూనియర్ ఇంజినీర్ సుధీర్, సంస్థాపక వెండర్స్ పాల్గొన్నారు.